కాశీబుగ్గలో భారీ చోరీ

రూ.10లక్షల నగదుతో పాటు 15 తులాల బంగారం, 4కిలోల వెండి అపహరణ

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పోతనపల్లి వీధిలో నివాసముంటున్న కొత్తకోట రామ ఇంటిలో సోమవారం భారీ చోరీ జరిగింది. పది లక్షల నగదుతో పాటు 15 తులాల బంగారపు అభరణాలు, 4 కిలోల వెండి వస్తువులను అగంతుకులు అపహరించారు. కాశీబుగ్గ పోలీసులు, బాధితుల కథనం మేరకు కాశీబుగ్గకు చెందిన కొత్తకోట రామ మూడు రోడ్ల జంక్షన్ వద్ద కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. ఉదయం 9గంటలకే రామ కిరాణా షాపుకు వెళ్లిపోగా 11 గంటల సమయంలో రామ భార్య లక్ష్మీప్రవీణ, కుమారుడు లోచన్ కలిసి కాశీబుగ్గ మూడు రోడ్లు జంక్షన్‌లో తన బంధువుల ఇంటిలో జరిగే శుభకార్యంకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. తిరిగి 11.45 నిమిషాలకు కొత్తకోట లోచన్ ఇంటికి సమీపంలో ఉన్న శారదానగర్‌లో నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఇంటికి వెళ్లి తిరిగి తమ సొంత ఇంటికి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు బద్దలుగొట్టి లోపలికి చొరబడినట్లు గుర్తించారు. తీరా లోపలికి వెళ్లే సమయంలో రెండు బీరువాలను బద్దలగొట్టి వాటిలో ఉన్న పదిలక్షల రూపాయల నగదుతో పాటు 15 తులాల బంగారపు ఆభరణాలు, 4 కేజీల వెండి వస్తువులు అగంతుకులు తీసుకుపోయినట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని తన తల్లి కొత్తకోట లక్ష్మీప్రవీణ్‌తో పాటు కిరాణా షాపులోఉన్న తండ్రి కొత్తకోట రామకు సమాచారం అందించారు. ఇటీవల ఒక ప్రైవేటు చిట్ నుంచి పదిలక్షల రూపాయలు ఇళ్ల నిర్మాణం కోసం తీసుకొచ్చామని, వాటిని కూడా దొంగిలించికిపోయారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి

చేరుకొని పరిశీలించారు. ఒక్కసారిగా భారీ స్థాయిలో దొంగతనం జరగడంతో శ్రీకాకుళం నుంచి క్లూస్ బృందం వచ్చి దొంగతనం తీరును పరిశీలిస్తుండగా మరో వైపు దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ ఎస్.ఐ పారినాయుడు తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ

- ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ డా. మనజీర్ జీలాని సమూన్

విశాలాంధ్ర -శ్రీకాకుళం: విభిన్న ప్రతిభావంతుల సమస్యలు తీర్చడానికి అవసరమైన సమగ్ర సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జీలాని సమూన్ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరం నందు కళాశాలలో డిగ్రీ, పి.జి చదువుతున్న విభిన్న ప్రతిభావంతులు 6 గురికి ల్యాప్‌టాప్ లు, ఒక్కరికి బ్రైన్ ప్లేయర్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు సంయుక్తంగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విభిన్న ప్రతిభావంతులతో మాట్లాడుతూ

వారు చదువుతున్న కళాశాల తదితర వివరాలు పై ఆరా తీశారు. ల్యాప్‌టాప్‌లో ప్రత్యేక సాఫ్ట్వేర్ ఇన్స్టాల్ చేయడం జరిగిందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐ.టి.ఐ నుండి పి.జి వరకు చదువుకున్న, చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థిని, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు కావాలంటే సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ, శ్రీకాకుళం అం కార్యాలయంలో, ఆన్లైన్ లో గాని దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ల్యాప్‌టాప్ పంపిణీ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎం గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ మురళీ, డిఆర్డిఎ పి.డి విద్యాసాగర్, విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ, సహాయ సంచాలకులు కవిత, కార్యాలయ సిబ్బంది, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

బీజేపీతో జత కడుతున్న వైసీపీ, టీడీపీ జనసేన పార్టీలను సాగనంపుదాం

ఏఐవైఎఫ్ నాయకులు యుగంధర్, శ్రీనివాసరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపేంత వరకు మా పోరాటాలు కొనసాగుతాయని, బీజేపీతో జత కడుతున్న ఏపార్టీ అయినా రాష్ట్రం నుంచి సాగనంపాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావులు అన్నారు. స్థానిక ఎన్.ఆర్ దాసరి క్రాంతిభవన్‌లో ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా యుగంధర్, శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఎన్డీఏ పాలనలో కులమత విద్వేషాలు, ఘర్షణలు పెరిగాయని, ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లిందన్నారు. పుల్వామా నుంచి మణిపూర్‌లో అల్లర్ల వరకు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అనేక ఘటనలు జరిగాయని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 2014లో అధికారంలో వచ్చిన టీడిపి, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ కూడా కేంద్రంలోని బిజెపికి తొత్తులుగా మారాయని విమర్శించారు. 2019 ఎన్నికల్లో బిజెపితో తెగతింపులు చేసుకున్న చంద్రబాబు ఇప్పుడు ఆపార్టీతో పొత్తు కోసం ఎందుకు తహతహలాడుతున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. విభజన హామీల

అమలులో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ వంటివి ఇవ్వకుండా నష్టం చేసిన మోడీతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్ జతకట్టడం దారుణమని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇండియా కూటమిలో కొనసాగుతున్నామని తెలిపారు. ఇండియా కూటమిని ప్రజలంతా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు గోరు వాసుదేవరావు, జిల్లా సహాయ కార్యదర్శి అరుగుల రాము, ఏఐవైఎఫ్ నాయకులు అరవింద్, కర్ణ వీరుడు, ప్రేమ్ చందు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలపట్ల ప్రత్యేకశ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలి

కలెక్టర్ డా. మనజీర్ జీలాని సమూన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, జిల్లా రెవిన్యూ అధికారి ఎం గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ మురళీ, డిఆర్డిఎ, పి.డి విద్యాసాగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన

అర్జీదారుల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జీలాని సమూన్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ స్పందన కార్యక్రమంలో కెఆర్ సి ప్రత్యేక ఉప కలెక్టర్ దొరబాబు, జెడ్పి సిఇఓ డి.వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి బి మీనాక్షి, డ్వామా పి.డి చిట్టి రాజు, డిసిహెచ్ఎస్ డా.రాజ్యలక్ష్మి, హౌసింగ్ పి.డి గణపతి రావు, ఇరిగేషన్ ఎస్ఇ డోల తిరుమల రావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణ చార్జీల రాయితీల పునరుద్ధరణపట్ల హర్షం

అప్పన్న గ్రీవెన్స్‌పట్ల స్పందించిన అధికారులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : రైల్వే ప్యాసింజర్ ట్రైన్‌లలో టికెట్ ధరలను 50 శాతం తగ్గించడంపట్ల సంతబొమ్మాళి మండలం బోరుభద్ర గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గొనప.అప్పన్న హర్షం వ్యక్తం చేసారు. ఇటీవల రైల్వే అధికారులకు గ్రీవెన్స్‌లో రాయితీ సమస్య తెలియజేసారు. దీంతో స్పందించిన అధికారులు రాయితీ పునరుద్ధరణ చేసినట్లు తెలిపారు. మూడేళ్ళ క్రితం దేశంలో కోవిడ్ (కరోనా వైరస్) వ్యాప్తి వున్న సమయంలో, రైల్వే సాధారణ పాసెంజరు ట్రైన్‌లను స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లుగా మార్పుచేస్తూ సెకండ్ క్లాస్ (అన్ రిజర్వుడ్) తరగతి టికెట్టు ధరను 50 శాతం పెంచారని ,ఇప్పుడు దేశం లో కోవిడ్ పూర్తిగా తగ్గుముఖం పట్టినప్పటికీ పాసెంజర్ ట్రైన్‌లలో పెంచిన ధరలనే కొనసాగించటం వలన వీటి పై ఆధారపడి ప్రయాణం సాగించే పేద, మధ్యతరగతి, దినసరి కూలీలు, చిరు ఉద్యోగ వ్యాపారస్తులకు ప్రయాణం భారంగా మారిందని తెలిపారు. పెంచిన టికెట్ ధరలను తగ్గించి, యదాస్థితిలో ఉంచాలని కోరుతూ కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖకి చాలా సందర్భాల్లో కోరామని ఆయన తెలిపారు. పాసెంజర్ ట్రైన్‌లలో టికెట్ ధరలను 50 శాతం తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. ముఖ్యంగా రోజువారీ విశాఖపట్నం డివిజన్ ద్వారా నడిచే డీ.ఎం.యూ, మెమో పాసెంజర్ ట్రైన్‌ల ద్వారా ప్రయాణం సాగించే వేలాది మంది సామాన్య, మధ్య తరగతి ప్రయాణీకులకు

టికెట్ ధరల తగ్గింపు ద్వారా చాల ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈసందర్భంగా రైల్వే టికెట్ చార్జీలలో రాయతీలు కల్పించినందుకుగాను కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ, విశాఖపట్నం డివిజనల్ మేనేజర్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ వారికి కృతజ్ఞతలు తెలియజేసారు.

దేవాదాయ భూమిపై కబ్జాదారుల కన్ను!

- సోంపేటలో మెయిన్‌రోడ్డు ప్రక్కనే ఆక్రమణకు రంగం సిద్ధం
- కన్నెత్తి చూడని అధికారులు

విశాలాంధ్ర-సోంపేట :సోంపేటలో దేవాదాయ శాఖ భూములు కబ్జాదారులకు వరంగా మారాయి. ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. సంబంధిత అధికార యంత్రాంగం కూడా సరైన దృష్టి పెట్టకపోవడంతో కబ్జాదారులు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. తాజాగా సోంపేట శివారున ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విజయదుర్గా ఆలయానికి మధ్యలో సోంపేట నుంచి కంచిలి వెళ్లే మెయిన్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న దేవాదాయశాఖకు చెందిన కోట్లాది రూపాయల విలువైన ఖాళీ భూముల్లో ఇళ్లస్థలాలు పేరిట ఆక్రమణకు మళ్లీ సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే సోమవారం చెట్లు, తుప్పలతో పేరుకుపోయిన స్థలాన్ని కూలీల ద్వారా చదును చేయించడం మొదలుపెట్టారు. ఈ విలువైన ఖాళీ స్థలం సోంపేట మండలం బేసిరామచంద్రాపురంలో వెలసిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి చెందినవి. బేసి రామచంద్రాపురం పరిధిలో 32 ఎకరాలు, సోంపేట పరిధిలో 9 ఎకరాల 40 సెంట్లు భూమి రికార్డుల పరంగా ఉన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం చదును చేస్తున్న ఖాళీ స్థలం గతంలో సుమారు నాలుగేళ్ల క్రితం ఓ వ్యక్తి అక్రమ నిర్మాణానికి విఫలయత్నం చేసిన విషయం తెల్సిందే. అప్పట్లో అధికారులు దేవాదాయశాఖ భూమిగా గుర్తించి అనుమతులు నిలిపి వేశారు. అయితే కబ్జాదారులు తెలివిగా సంబంధిత భూములకు అసలు సర్వే నెంబర్లు పక్కన పెట్టి తప్పుడు సర్వే నెంబర్లుతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు కూడా పూర్తి చేసుకోవడం సదరు

డాక్యుమెంట్లు చేత పట్టుకుని అది జిరాయితీ భూమి అని తాము కొనుగోలు చేసుకున్నామని ఎదుట వారి వద్ద దబాయించడం వెన్నతో పెట్టిన విద్యగా మారింది. ప్రస్తుతం సోంపేట మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా స్థలాల రేట్లు ఆకాశాన్ని తాకుతున్న విషయం తెల్సిందే. ఈ ప్రాంతంలో ఒక మూర ధర 3 లక్షల రూపాయలు పలుకుతుందంటే అతిశయోక్తి కాదు. అటువంటి కోట్ల రూపాయల విలువైన భూములను రాజకీయనేతల సహకారంతో దేవాదాయశాఖ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులను ప్రసన్నం చేసుకుంటూ దర్జాగా సొంతం చేసుకుంటున్నారు. దీనిపై ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు స్పందించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది. ఈ విషయమై దేవాదాయ శాఖ స్థానిక ఇన్స్పెక్టర్ రామారావు వద్ద విశాలాంధ్ర ప్రస్తావించగా వెళ్లి స్థలాన్ని పరిశీలిస్తామని ఆక్రమణలను అడ్డుకుంటామని అన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోండి

చంద్రబాబు నాయుడును కోరిన అగ్రిగోల్డ్ అసోసియేషన్ నాయకులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : అగ్రి గోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరిస్తామని టీడీపీ-జనసేన ఉమ్మడి మానిఫెస్టోలో పెట్టి బాధితులను ఆదుకోవాలని అగ్రీ గోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మాజీ ముఖ్యమంత్రి, జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును కోరారు. సోమవారం రా కదలిరా కార్యక్రమానికి వచ్చిన చంద్రబాబు నాయుడు ను టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. అగ్రిగోల్డ్ లో డబ్బులు దాచుకొని ఆ

యాజమాన్యం మోసం చేయడంతో అగ్రిగోల్డ్ బాధితులు రోడ్డున పడ్డారని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చి పూర్తిస్థాయిలో న్యాయం చేయడంలో విఫలమయ్యారన్నారు. టిడిపి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని చేర్చితే మా అసోసియేషన్ కుటుంబ సభ్యుల ఓట్లను టిడిపి జనసేన కూటమి అభ్యర్థులకు వేసి గెలిపించుకుంటామని అధికారంలోకి వచ్చిన వెంటనే మా సమస్యకు పరిష్కార మార్గం చూపాలని వారు చంద్రబాబును కోరారు. చంద్రబాబును కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఆరేలమ్మ, జిల్లా నాయకులు పైడి గోవిందరావు కింజరాపు రాజారావు తదితరులు ఉన్నారు.

భూసర్వేలో అధికారులు ప్రజల సమస్యలు పరిష్కరించాలి

మేజరు పంచాయతీ సర్పంచ్ సంజీవరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : వివిధ భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు రీ భూసర్వే ద్వారా అధికారులు ఆ సమస్యలు పరిష్కరించాలని కోటబొమ్మాళి మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ళ సంజీవరావు అన్నారు. ఆయన సోమవారం పంచాయతీ కార్యాలయంలో ప్రజలు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భూముల విషయంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కరం కాని సమస్యలు ఉన్నాయని వాటిని కుణ్ణంగా పరిశీలించి ప్రజలకు, రైతులకు న్యాయం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వీఆర్వో పేడాడ అకిల్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రతిభ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి : మంత్రి డా.సీదిరి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : క్రీడాకారులు గ్రామీణ ప్రతిభను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. సోమవారం బాతుపురం పెదవంక సర్పంచ్ బత్తిలి సుజన లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ వై.ఎస్.జగన్మోహనరెడ్డి యువకులు క్రీడల్లో రాణించాలని ఉద్దేశంతో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పెట్టారని, యువకుల్లో నైపుణ్యం బయటకు తీసుకు వచ్చేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహద పడుతుందన్నారు. వాలీబాల్ పోటీలు గెలిపొందిన ప్రథమ బహుమతి సచిన్ స్పోర్ట్స్‌కు 15వేల రూపాయలు, రెండువ బహుమతి యువతరం సేవా సమితికు 7500రూపాయలు, మూడో బహుమతి బాతుపురం, 4వ బహుమతి కంచిలిలకు 5వేల రూపాయలు చొప్పున్న మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉదయ్‌కుమార్, పెదవంక గ్రామ కమిటీ అధ్యక్షులు బత్తిని రామారావు, చెల్లూరు తాతారావు, ఇరోతు లక్ష్మణరావు, బత్తిని యోగేశ్వరరావు, యువకులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ 'స్పందన' కార్యక్రమానికి 19 ఫిర్యాదులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ప్రజా సమస్యలను చట్టపరిధిలో పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలని ఎస్పీ జి ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశాలు ఇచ్చారు."స్పందన" ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నిర్ధిత సమయంలో నివేదికను అందించాలని అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు స్పందన కార్యక్రమానికి 19 ఫిర్యాదులు అందాయి.

ఇందులో లలో ఆస్తి తగాదాలు 2, కుటుంబ కలహాలు 3, చీటింగ్ పై 2, సివిల్ 2,తదితర ఫిర్యాదులు 7, పాతవి 3 అందాయి. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారలో "స్పందన" కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యదు దారుల నుండి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదు దారులు సమస్యలను ఎస్పీ ముందు బాధితులు విన్నవించుకోగా, ఎస్పీ సానుకూలంగా స్పందించి, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ తోపాటు అదనపు ఎస్పీ డా. జి ప్రేమ్ కాజల్, డిఎస్పీ బి విజయ కుమార్ పాల్గొని పిర్యాదులు పరిశీలించారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఒత్తిడిని జయించవచ్చు

వెల్‌నెస్ క్లబ్ కౌన్సిలర్ పాపారావు

విశాలాంధ్ర-కవిటి : ప్రణాళికా బద్దంగా చదివితే ఒత్తిడిని జయించవచ్చు అని వెల్ నెస్ క్లబ్ కౌన్సిలర్ పాపారావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వెల్ నెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు స్ట్రెస్ మేనేజ్మెంట్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పేడాడ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెల్ నెస్ క్లబ్ కౌన్సిలర్ జె పాపారావు విద్యార్థులకు పరీక్షలు ముందు, పరీక్షలు జరుగుతున్న సమయాలలో తీసుకోవలసిన ముఖ్యమైన జాగ్రత్తలతో కూడిన సూచనలు,సలహాలు అందజేశారు.ప్రణాళికా బద్ధంగా చదివితే ఒత్తిడి లేకుండా బాగా చదివి మంచి మార్కులు సాధించవచ్చునీ తెలిపారు. శారీరక,మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యం అని, వాటిని కాపాడుకోవడానికి విద్యార్థులు ప్రయత్నించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి హరి,బి శ్రీను బాబు,కె కరుణశ్రీ,డి రమేష్,విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌ను దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలి

- జిల్లా నుంచి ఒక రైలు అయినా మొదలుకావాలి
- ఎంపీ రామ్మోహన్ నాయుడు
- అమృత భారత్ స్టేషన్ పథకం చారిత్రాత్మకం
- శాసన సభాపతి తమ్మినేని

విశాలాంధ్ర-ఆమదాలవలస : శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్ ను దత్తత తీసుకుని అభివృద్ధి చేసే విధంగా అన్ని హంగులు ఏర్పాటుచేసిన అభివృద్ధి చేయాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. అమృత భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్‌గా ఆముదాలవలస, దూసి, నౌపడ, ఇచ్ఛాపురం స్టేషన్లను అభివృద్ధికి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన సందర్భంగా సోమవారం ఆముదాల వలసలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రూ. 25 కోట్లతో ఆముదాలవలస వంతెన పనులతో పాటు మూడో లైన్ ఏర్పాటుకు సర్వే పనులు పూర్తయ్యాయని అందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అలాగే రెండు ప్రధాన రహదారులు రూ. 136 కోట్లతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. దూసి పేట, మెట్టెక్కివలస దారులకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అభివృద్ధి చేయవలసి ఉన్నప్పటికీ, రాష్ట్ర ఆర్థిక స్థితి గతులు దృశ్య కేంద్ర ప్రభుత్వమే పూర్తి నిధు లను వెచ్చించి దేశ ప్రజలను తన సభ్యులుగా భావించిన ప్రధానమంత్రి దేశవ్యాప్తంగా 554 అండర్ పాసెజ్లు, టన్నెల్ పనులకు (అంతర్గత మార్గాలు) శంకుస్థాపనలు జరు గుతుంటే అందులో ఒక్క మన జిల్లాలోని మూడు స్టేషన్లో ఆధునీకరణకు ప్రారంభోత్స వాలు జరగటం శుభపరిణామమన్నారు. శ్రీకాకుళం రైల్వే

స్టేషన్ నుంచి కనీసం ఒక్క రైలు అయినా మొదలయ్యేలా కృషి చేస్తా నని ఎంపీ హామీ ఇచ్చారు. రైల్వే స్టేషన్లో పున రాభివృద్ధి మౌలిక సదుపాయాలు కల్పన, ఎక్స్ప్రెస్ రైలు నిలుపుదల, ఆయా ప్రాంత ప్రజలకు అనువైన ఒంటి అంశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేసే విధంగా అధికా రులు పనులు చేపట్టాలని కోరారు. ప్రతి స్టేషన్ లోనూ కనీసం రెండు రైళ్లు ఆగేవిధంగా అయ స్టేషన్ల కలెక్షన్లు చూసుకొని అన్ని స్టేష న్లను రైలు ఆగే విధంగా చూస్తామన్నారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలని అన్నారు. నరేంద్ర మోడీ 41 వేల కోట్లతో 1500 రైల్వే స్టేషన్లను అభివృద్ధికి చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. శాసన సభాపతి తమ్మినేని సీతారాం మాట్లాడుతూ అమృత భారత్ పథకాన్ని అమలు చేయటం చారిత్రక నిర్ణయమన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా ప్రారంభించి రైల్వే స్టేషన్లో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజాభి మానం గెలుచుకొనె అవకాశం ఉందన్నారు. గతంలో పలుమార్లు స్టేషన్ పరిసర ప్రాంతాల అభివృద్ధి ఎలక్ట్రిఫికేషన్ వంటి అంశాల పనులు పూర్తి చేసి అభివృద్ధికి అంకితమై పని చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని ఆము దాలవలస స్టేషన్ కావడంతో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందాలంటే తాను చేసిన ప్రతిపాదనలను పూర్తి చేయాలని అన్నారు. సింహద్వారాన్ని ఏర్పాటు చేస్తే రైల్వేస్టేషన్‌కి ప్రత్యేక ఆకర్షణ వస్తుందన్నారు. బిజెపి జిల్లా నాయకులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వ్యవస్థలో అభివృద్ధి చెందాలంటే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మంచి సంక ల్పంతో రైల్వే ప్రాజెక్టులను జాతికి అంకితం చేసి, ప్రజలను తన కుటుంబ సభ్యులుగా అభివర్ణించారని తెలిపారు. నా ప్రజలకు అనేక సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రధానమంత్రి రైల్వే స్టేషన్ అభివృద్ధికి వేల కోట్ల రూపాయల ఖర్చు చేశారని వివరిం చారు. వికసిద్భారత్ ద్వారా అనేక కార్య క్రమాలు చేసి 80 కోట్ల మంది ప్రజానీకానికి మేలు జరిగేలా కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారని అన్నారు. ముందుగా టాలెంట్ టెస్ట్ పరీక్షలను జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. విజేతలైన పాఠశాల విద్యార్థులకు బహుమ తులను అందించారు. కార్యక్రమంలో ఎడిఆర్ఎం సుధీర్ కుమార్ గుప్తా, సీజీఎం రైల్వే ఉన్నతాధికారులు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ ద్వారా సిక్కోలుకు దేశంలో ప్రత్యేక గుర్తింపు

ఎస్‌సిసి సభ్యులు రామకృష్ణ నాయుడు

విశాలాంధ్ర-ఆమదాలవలస : జిల్లా రైల్వేస్టేషన్ ద్వారా సిక్కోలుకు దేశంలోని ప్రత్యేక గుర్తింపుని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అందించారని రైల్వే స్టేషన్ కన్సల్టెన్సీ కమిటీ (ఎస్ఎస్‌సి) సభ్యులు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు ఆనెపు రామకృష్ణ నాయుడు అన్నారు. సోమవారం దూసి రైల్వేస్టేషన్లో నిర్వహించిన అమృతభారత్ కార్యక్రమంలో స్టేషన్ అభివృద్ధి శంకుస్థాపన సందర్భంగా మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ రైల్వే స్టేషన్లో అభివృద్ధి చేసి జాతికి అంకితం చేశారని తెలిపారు. దేశ ప్రజలంతా తన కుటుంబంగా భావించి స్టేషన్లో పునరాభివృద్ధి చేసి అందించే ఘనత కేంద్రానికి దక్కిందన్నారు. ఈ తరుణంలో శ్రీకాకుళం రోడ్డు రైల్వే ఒక ప్రత్యేక గుర్తింపు పొందిందని దీంతో దేశవ్యాప్త గుర్తింపు వచ్చిందన్నారు. స్వాతంత్రోద్య సమయంలో గాంధీజీ దూసి రైల్వే స్టేషన్ లో అడుగిడిన వేళ ఈ ప్రాంతంలో ఆనందాలతో ఉప్పొంగి పోయిందన్నారు. ఆ పులకింపునకు గుర్తుగానే దూసిపేట వద్ద రైల్వే స్టేషన్ పునరాభివృద్ధికి ప్రధాని కంకణం కట్టారని, అందుకు ఎంపీ రామ్మోహన్‌నాయుడు కృషి చేశారని వివరించారు. రైల్వే స్టేషన్ ప్రాంతంలో ప్రధాన వంతెన నిర్మాణానికి 70 కోట్ల నిధులను మంజూరు చేసి ఆధునీ కీకరణ చేస్తున్నట్లు తెలిపారు. నరేంద్ర మోడీ ఏకకాలంలో 554 రైల్వేస్టేషన్లను, 15 వందల రోడ్ ఓవర్ బ్రిడ్జ్లను, అంతర్గత మార్గాలను ప్రారంభోత్సవాలు చేసి గిన్నిస్ రికార్డ్‌గా చరిత్ర సృష్టించారని వివరించారు. జిల్లా రైల్వేస్టేషన్‌లో అభివృద్ధికి ఎంపీ రామ్మోహన్ నాయుడు నిరంతర కృషి ఫలితమే ఏక కాలంలో మూడు స్టేషన్లు పునరాభివృద్ధికి పనులు జరగటం విశేషమన్నారు. ప్రత్యేక రైళ్లు జిల్లా కేంద్రంలో నిలుపు చేసేందుకు ఎంపీ కింజరాపు శక్తివంచన లేకుండా పని చేస్తున్నారని తెలిపారు. ముందుగా స్థానిక పాఠశాలల విద్యార్థులు నృత్య ప్రదర్శనలు పాల్గొని ఆకట్టుకున్నాయి. వీరికి ప్రత్యేక బహుమతులు అందించి సన్మానాలు చేశా రు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు స్టేషన్ ప్రగతి నివేదికను అందించారు. ఎస్సీసీ సభ్యులు సనపల నర్సింగరావు, రైల్వే అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా 'తిర్రి'

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా తిర్రి శాంతారావును అమరావతిలో ఆంధ్ర రాష్ట్ర ఫిషరీస్ కాంగ్రెస్ ఉప చైర్మన్, ఉత్తరాంధ్ర జిల్లా కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త రాకేష్ నియమించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ శాంతారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గ్రామాల్లో బలోపేతం కోసం కృషి చేయాలని, యువకులతో కాంగ్రెస్ పార్టీలో చర్చించాలని అన్నారు. కార్యక్రమంలో ఫిషరీస్ రాష్ట్ర అధ్యక్షులు కదిరి జగన్నాథ:, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పేరాడ పరమేశ్వరరావులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో ప్రతిపాదనలు అందజేయాలి

విశాలాంధ్ర-జలుమూరు : బిపిడిపి యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎంపీటీసీల పరిధిలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు రెండు రోజుల్లోగా ప్రతిపాదనలు అందజేయాలని ఎంపీపీ వాన గోపి అన్నారు. జలుమూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీలతో బిపిడిపి యాక్షన్ ప్లాన్‌పై సమావేశం నిర్వహించారు. అందించిన ప్రతిపాదనలపై ఆయా శాఖలకు చెందిన జేఈ లకు ఫార్వర్డ్‌చేసి ఎస్టిమేషన్లు తయారు చేయిస్తామన్నారు.

పునరావాస కేంద్రానికి విరాళం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట సమీపంలో గల సీతయ్య ఫౌండేషన్ ఆవరణలో కొత్తగా నిర్మిస్తున్న దివ్యాంగ చిన్నారుల పునరావాస కేంద్రానికి ఒడిషాకు చెందిన సవరదేవిపేట మహిళలు సోమవారం 11వేల రూపాయలను విరాళంగా అందించారు. దివ్యాంగుల సేవలో మేము సైతం అంటూ ఉడతాభక్తిగా తమ సహాయాన్ని అందజేయడంపట్ల ఫౌండేషన్ నిర్వాహకులు గుల్లరమేష్, మోహనరావులు సదరు మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు.

దాలేశ్వరం అభివృద్ధికి ప్రాధాన్యం

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి : కంచిలి మండలం ఎంఎస్‌పల్లి పంచాయతీ దాలేశ్వరం గ్రామంలో అభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంపీపీ పైల దేవదాసురెడ్డి, సర్పంచ్ కొనపల సురేష్‌పేర్కొన్నారు. దాలేశ్వరంలో 15వ ఆర్థిక సంఘ ఎంపీపీ నిధులు 4లక్షలతో నిర్మించిన సామాజిక భవనం, స్మశానవాటిక మండపాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి చేపడుతూ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు అన్నారు. అలాగే దాలేశ్వరంలో పంచాయతీ చెత్త సేకరణకు బకెట్లు అందజేశారు. గ్రామ యువకులకు వాలీబాల్ కిట్లును అందజేశారు. ఈ కార్యక్రమంలో వజ్జ మృత్యుంజయం, లడ్డుకేశవపాత్రో, బుడ్డెపు ఆనంద్, ఇసుగౌడో తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి ఇష్టపడి చదవాలి... సత్ఫలితాలు సాధించాలి

ప్రిన్సిపాల్ పిఈఎస్ఎన్ పట్నాయక్

విశాలాంధ్ర-హిరమండలం : ప్రతీ ఒక్క విద్యార్థి ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని హిరమండలం ప్రభుత్వజూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.ఈశ్వర సత్యన్నారాయణ పట్నాయక్ అన్నారు. సోమవారం జూనియర్ కళాశాల హిరమండలంలో ఇంటర్ మీడియట్ రెడో సంత్సర విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంను జూనియర్ ఇంటర్ విద్యార్థులు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ పిఈఎస్ఎన్ పట్నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని సందేశాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సెల్ ఫోన్‌కు ప్రతీ విద్యార్థి దూరంగా ఉండాలని ఎంతో కష్టపడి విద్యార్థుల తల్లిదండ్రులు చదివిస్తున్నారని, ఉన్నత చదువులు చదివి మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకొని తల్లి దండ్రులకు కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఆశయంతో ముందుకు సాగాలని, మార్చి 1వ తేది నుండి జరుగనున్న ఇంటర్ పరీక్షలకు మెలుకువలు సలహాలు సూచనలు ప్రిన్సిపాల్ చేశారు. అనంతరం విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో హిరమండలం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.అరుణ, అధ్యాపకులు, అధ్యాపకేతరులు, సిబ్బంది, 170 మంది ఇంటర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : చదువులమ్మ ఒడిలో కలిసి చదువుకున్న పూర్వపు విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. అప్పటి తరగతి గదులను తనివి తీరా చూసుకొని జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేసుకున్నారు. మండలం మర్రిపాడు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998 -99 సంవత్సరాల్లో చదివిన పదో తరగతి విద్యార్థులు 25 సంవత్సరాల తరువాత ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. అప్పటి గురువులకు సన్మానించి మెమొటోరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ గురు శిష్యుల సంబంధం గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి హెచ్ఎం అన్నాజీ రావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు అట్టాడ రాంప్రసాద్, పూర్వపు విద్యార్థులు వాడరేవు రవి తదితరులు ఉన్నారు.

కనుల పండుగగా సుదర్శన హోమం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో వెలసివున్న శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామి వారి ఆలయంలో సింహాచల దేవస్థానం వేదపండితులు ముప్పిరాల నారాయణమూర్తి శిష్య బృందం చే కుంటి కోట గ్రామానికి చెందిన ఓ భక్తుని ఆర్థిక సహాయంతో కనుల పండుగగా సుదర్శన యాగం చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామి వారి ధ్రువమూర్తుల ప్రతిష్టాపన ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి ఆలయ అర్చకులు సత్యనారాయణ స్వామి,రాజు స్వామి, రాజేష్ స్వామి లచే వేకువజామున సుప్రభాత సేవ,నవకలిస స్థపనము,అలంకరణ,తీర్థ గోష్టి, సుదర్శన హెరామం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణచేపట్టారు.ఈ కార్యక్రమానికి గ్రామస్తులతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పొందల కుమారి కృష్ణారావు దంపతులు, పొందల వెంకట శ్రీ రాంబాబు, సంధ్య సురేష్ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

28న జైభారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు జేడీ జిల్లాకు రాక

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు మాజీ జేడీ లక్ష్మీనారాయణ, బుధవారం జిల్లాకు వస్తున్నట్లు ఆ పార్టీ అధికార ప్రతినిధి చౌదరి లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చిన్న బజార్ క్లాత్ మర్చెంట్ అసోషియేషన్ లో ఉదయం 10 నుంచి 1 గంటల వరకు ఈ సమావేశం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో పార్టీ మేనిఫెస్టో ఆవిష్కరణ మరియు పార్టీ లో చేరికలు జరుగుతాయి అని తెలిపారు. సాంప్రదాయక, కుటుంబ రాజకీయాలకు స్వస్తి పలికి విద్యావంతు లైన యువత, మేధావులు పార్టీ కి మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. జిల్లా ప్రజలు ఈ సమావేశంలో పాల్గొని ఈ కార్యక్రమంను జయప్రదం చేయాలని కోరారు.

రైస్, ఆయిల్ మిల్లు కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైస్, ఆయిల్ మిల్లు కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి పి.తేజేశ్వరరావు, శ్రీ చైతన్య రైస్ అండ్ ఆయిల్ మిల్లు వర్కర్స్ యూనియన్ కన్వీనర్ హెచ్.ఈశ్వరరావు, కో-కన్వీనర్ కె.సూరయ్య హెచ్చరించారు. సోమవారం రైస్, ఆయిల్ మిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శ్రీ చైతన్య రైస్ అండ్ ఆయిల్ మిల్లు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆర్అండ్‌బి బంగ్లా నుండి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించి అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రైస్, ఆయిల్ మిల్లులో సుమారు 5000 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరు అతి తక్కువ వేతనాలతో దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైస్ మిల్లులో పనిచేస్తున్న కార్మికుల హాజరు వివరాలను యాజమాన్యాలు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు గాని, పి.ఎఫ్, ఈ.ఎస్.ఐ, 8 గంటల పనిదినం మొదలగు కార్మిక చట్టాలు ఏ ఒకటి యాజమాన్యాలు అమలు చేయడం లేదని విమర్శించారు. కార్మికులు తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. కార్మిక చట్టాలు అమలు చేయని యాజమాన్యాలపై కార్మిక శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు.ఐఎల్ఓ నిబంధనల ప్రకారం 50 కేజీలు బస్తా ఉపయోగించాలని కానీ జిల్లాలో ఎక్కడ ఉపయోగించడం లేదని అన్నారు. యాజమాన్యాలు కార్మికులతో అధిక బరువులు మోయించడంతో కార్మికుల అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులందరికీ కనీస వేతనం,పి.ఎఫ్, ఈ.ఎస్.ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య రైస్ అండ్ ఆయిల్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె.కేశవరావు, జి.నీలన్న, ఎస్.ఆనంద్, బి.అప్పారావు, జి.గురువులు, పి.అప్పన్న, బి.కృష్ణారావు, పి.రమేష్, బి.రామారావు, బి.రాజారావు, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఐతమ్ వేధికగా జాతీయ స్థాయి హేక్తాన్

విశాలాంధ్ర-టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా ఈనెల 27 నుండి 29 వరకు జాతీయ స్థాయిలో 48 గంటల హేక్తాన్(ఆవిష్కార్)ను నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నూతన హేక్తాన్ పోటీలో ఎంపికైన మూడు ఉత్తమ ప్రాజెక్ట్ లకు రూ.2.50 లక్షల వరకు నగదు బహుమతులను అందజేస్తున్నట్టు డైరెక్టర్ తెలిపారు. ఐతమ్, గ్రిరిక్స్ కంపెనీలు సంయుక్తంగా నిర్వహించే ఈ హేక్తాన్ పలుకంపెనీలు సహాయ సహకారాలు అందిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఎపి, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ, ఒడిస్సా, ఆగ్రా, చండీఘర్, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన యూనివర్శిటీలు, ఇంజినీరింగ్ కళాశాలల నుండి 1000 మంది పాల్గొనుటకు తమ పేర్లను నమోదు చేసుకొనగా వారిలో 200 మంది తమ ప్రాజెక్టుల వివరాలను తెలియజేశారని వాటిలో 50 నూతన ఆవిష్కరణలు ఈ హేక్తాన్ పాల్గొనుటకు నిపుణుల కమిటీ ఎంపిక చేసిందన్నారు. ఉత్తమ ప్రాజెక్టులకు నగదు, ప్రశంసాపత్రాలను అందజేయుటకు, ప్రముఖ టిసిఎస్ కంపెనీ ఇన్నోవేషన్ హెడ్ బాలాప్రసాద్ పెద్ది గ్రీక్సుర్ (గ్రీక్స్) సిటిఓ శిఖర్ గోయల్ నొయిడాలు, టాటా టెక్నాలజీస్ చీఫ్ ఇంజినీర్ రవీంద్రషాలు పాల్గొంటున్నట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు వివరించారు. వీటితో పాటు మార్చి ఒకటిన నిర్వహించనున్న ఐతమ్ వార్షికోత్సవానికి ఐఐఎస్ఇ ప్రాంతీయ అధికారి డాక్టర్ బిజయ్ కుమార్ సాహు, ఇన్ఫినిటమ్ మీడియా నెట్ వర్క్ సాల్యూషన్స్ సిఈఓ. రాహుల్ రాఘువేంద్రలు పాల్గొని విద్యార్థులకు రూ.20 లక్షలవరకు మెరిట్ స్కాలర్షిప్పు లు, భాగ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు పారితోషకాలు అందివ్వనున్నట్టు డైరెక్టర్ తెలిపారు. ఐతమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరుగుతున్న ఈ హేక్‌ను కన్వీనర్ ఐఐసి ఇన్చార్జ్ డాక్టర్ జి.సతీష్కుమార్, బృంద సభ్యులు గా డాక్టర్ ఎం.ఎన్.వి.ఎస్.ఎస్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ జాకా సురేష్కుమార్, డి.గిరీష్ కుమార్, విద్యార్థి ప్రతినిధులుగా ఈఈఈ, సిఎస్ఈ ఆఖరి ఏడాది విద్యార్థులు ఆర్. హరిచందన, సాయి తరుణ్ మిశ్రాలు నిర్వహణ భాద్యతలు చేపడుతున్నట్టు ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలియజేశారు.

త్వరలో రైతుల ఖాతాలకు పంట ఋణాలు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : 2021-22 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన సున్నా వడ్డీ పంట ఋణాలకు సంబంధించిన రైతుల జాబితా సిద్ధం చేసామని వ్యవసాయాధికారిణి భార్గవి అన్నారు. సోమవారం బెల్లుపడ రైతు భరోసా కేంద్రం రైతుల జాబితాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఆర్బీకేలో సున్నా వడ్డీ పంట ఋణాలు పొందే వారి జాబితా ప్రదర్శన జరిపిస్తున్నామని, మండలం మొత్తం మీద 2021-22 రభి కి గాను 1168మంది రైతులకు రూ॥14,43,786/-లు , ఖరీఫ్‌కు గాను 1539 మందికి రూ॥ 31,75,845/-లు రానున్న ఫిబ్రవరి28నాటికి ముఖ్యమంత్రి మీట నొక్కడం ద్వారా నేరుగా రైతుల ఖాతాలకు జమ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఎస్. మల్లేశ్వర రావు, నీటి సంఘం అధ్యక్షుడు అనపాన పితంబర్, వై.సి.పి నాయకుడు నీలాపు డిల్లీ, పలువురు రైతులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి లక్ష తమలపాకుల అర్చన

విశాలాంధ్ర-జలుమూరు : మండలం శ్రీముఖలింగం లోని వీరాంజనేయస్వామి ఆలయంలో మాఘపౌర్ణమి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజమహేంద్ర వరం తాటిపాకకు చెందిన భాస్కరభట్ల లక్ష్మణకుమార్, పుష్పలత దంపతుల ఆధ్వర్యంలో లక్ష తమలపాకులతో అర్చన చేపట్టారు. సుమారు ఐదు గంటలపాటు అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారి ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.

ఉపాధ్యాయుని పాత్రలో సోంపేట ఎంపీపీ

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉపాధ్యాయుని పాత్ర పోషించారు. స్థానిక సర్పంచ్ నగిరి ప్రభావతితో కలిసి కళాశాలకు కొత్తగా నిర్మించిన సిమెంట్ రహదారిని ప్రారంభించారు. అనంతరం కళాశాలకు వెళ్లిన కొత్తగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియెట్ విద్యార్థులకు కొంత సేపు వైద్యునిగా తన అనుభవాలు, విద్య యొక్క ప్రాముఖ్యత, భవిష్యత్తులో ఉద్యోగాలు లభించడం, క్రమశిక్షణతో మెలగడం, మంచి భవిష్యత్తు నిర్మాణానికి చేపట్టాల్సిన అనేక అంశాలను గురించి విద్యార్థులకు విపులంగా వివరించారు. ఇష్టపడి చదవాలని, ఉన్నతమైన ప్రతిభ సాధించాలని, బంగారు భవిష్యత్తును పొందాలని ఆకాంక్షించారు.

చలో విజయవాడ వాయిదాను ఏపీటీఎఫ్ ఖండిస్తోంది

విశాలాంధ్ర-పొందూరు: ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు ఈనెల 27 న చేపట్టాల్సిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జేఏసీ అర్ధాంతరంగా వాయిదా వేయడాన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి పప్పుల తిరుమలరావు చెప్పారు. ఈమేరకు పత్రికాప్రకటన విడుదల చేసారు. 20 డిమాండ్లతో తలపెట్టిన ఉద్యమంలో భాగంగా రెండుదశలు పూర్తిచేసుకుని మూడవదశలో చేపట్టాల్ని చలో విజయవాడ వాయిదాతో ఉద్యోగ ఉపాధ్యాయులు తీవ్ర నిరాశకు లోనయ్యారన్నారు. సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరే బంగా ఈ నెల 20 న పాత తాలూకాకేంద్రాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం 4 గం టలవరకు చేపట్టనున్న దర్నాలో ఉద్యోగ ఉపాధ్యాయులు కోరారు.

10వేలు మందితో ర్యాలీగా బయలుదేరిన అచ్చెన్న పసుపుదండు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : శ్రీకాకుళంలో రాష్ట్ర టిడిపి అధినేత నారా చంద్రబాబు సోమవారం సాయంత్రం నిర్వహించే రా... కదలిరా కార్యక్రమానికి టెక్కలి నియోజకవర్గానికి సంబందించి రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు, స్థానిక శాసన సభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడులు నేతృత్వంలో మోటారు సైకిల్, కార్లు, ఆటోలుతో సుమారు 10వేలు మంది కార్యకర్తలు, అభిమానులు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ముందుగా అబ్బాయిబాబాయ్‌లు ఒకే మోటార్ సైకిల్‌పై కూర్చోని కార్యక్రమాన్ని ప్రారంభించటమే కాకుండా ర్యాలీ అధ్యాంతం అచ్చెన్నాయుడు మోటర్ సైకిల్ నడుపగా రామ్మోహన్‌నాయుడు వెనుక కర్చోని కార్యకర్తలను కేరింతలతో ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. నాలుగు మండలాల పార్టీ అధ్యక్షుడు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరై ముందుగా ఎన్టీఆర్ భవనం వద్ద ఏర్పాటు చేసిన ఆతీధ్యం స్వీకరించి ర్యాలీని కొనసాగించారు. ఈ ర్యాలీతో

కోటబొమ్మాళి మండల కేంద్రంతోపాటు జాతీయరహదారి పొడవున పసుపుమయిమైంది.

అతిథి అధ్యయపకులకు కాంట్రాక్టు వ్యవస్థలో విలీనం చేయండి

చంద్రబాబుకు వినతిపత్రం సమర్పించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : అధ్యాపకులకు కాంట్రాక్టు వ్యవస్థలో విలీనం చేయాలంటూ, రాష్ట్ర అతిథి అధ్యాపకుల సంఘం ఉపాధ్యక్షులు చల్ల జగ్గారావు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేంద్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు సోమవారం దరఖాస్తు సమర్పించారు. వినతి పత్రంలో వివరాలు ప్రకారం అతిథి అధ్యాపకులు అయిన మేము మీ ప్రభుత్వ హయాంలో (2015) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నియమకం అయ్యాము మా వేతనము నెలకు గరిష్టముగా 10,000 రూపాయిలు మాత్రమే గా ఉంది. తర్వాత

వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఎం టీ ఎస్ పార్ట్ టైం అధ్యాపకులకు దప, దఫాలుగా 57,100 రూపాయిలు వేతనం పెంచడం జరిగింది కానీ, మాకు మాత్రము అదే వేతనాన్ని నేటికీ కొనసాగించడం జరుగుతుంది. దీనికి కారణం మేము తెలుగుదేశం కార్యకర్తలం గా భావించి అనేకసార్లు ఆర్థిక శాఖ వెళ్లిన ఫైలును తిరస్కరించడం జరిగింది. 1074 మంది అతిథి అధ్యాపకులు కాంట్రాక్ట్ వ్యవస్థలోకి విలీనం చేసి మాకు జీవితంలో వెలుగులు నింపుతారని మిక్కిలి హృదయపూర్వకంగా విన్నవించుకుంటున్నాము.

పార్వతి కళ్యాణం చేద్దాం రారండి

పేదరికానికి స్పందించిన స్పందన ఫౌండేషన్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : జీవించు జీవితాన్నివ్వు అనే నినాదంతో సంతబొమ్మాళి మండలంబడే కుప్పన్నపేటకి చెందిన స్పందన ఫౌండేషన్ సభ్యులు పోలాకి మండలం సొండిపేట గ్రామానికి చెందిన అనాధ బాలిక సింహాద్రి పార్వతికి వివాహానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు సోమవారం పార్వతి ఇంటికెళ్లి తమవంతు సహాయం గా 15000 సాయం అందించారు. పార్వతి అమ్మ నాన్న చిన్నప్పుడే చనిపోగా, మావయ్య ఇంతవరకు బాగోగులు చూడగా, తనకు కూడా ఇద్దరు అమ్మాయిలు కావడంతో పార్వతి వివాహం స్వచ్చంద సంస్థలు సాయం చేయాలని కోరగా, స్పందన ఫౌండేషన్ ప్రతినిధులు ఇంటికి వెళ్ళి తన వంతు సాయంగా 15000 అందించారు. ఈ పుణ్యకార్యం లో ఇంకా ఎవరైనా పాల్గొని సాయం అందించాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు షణ్ముఖ రావు, నర్సాపురం సర్పంచ్ భూషణ్ రెడ్డి, ఫల్గునారెడ్డి, విశ్వనాథ్, స్వామి మొదలైనవారు పాల్గొన్నారు.

సెక్యూరిటీ బ్యాండు నిబంధనను మినహాయించాలి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : ప్రభుత్వం నిర్వహిస్తున్న వైన్ షాపుల్లో పనిచేస్తున్న సూపర్వైజర్లు, సేల్స్ మాన్ లకు కొత్తగా ప్రభుత్వ ఉద్యోగుల నుంచి సెక్యూరిటీ బ్యాండులను తీసుకొని ఇవ్వాలని వారంతా సోమవారం ఎచ్చెర్ల లోని ఐఎంఎల్ డిపో డిఎం బి సుబ్బారావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. 2019 నుంచి ఈ షాపుల్లో పనిచేస్తున్నామని అప్పట్లో ఇచ్చిన సెక్యూరిటీ బాండ్లను కాదని కొత్తగా ప్రభుత్వ ఉద్యోగుల నుంచి బాండ్లను కావాలని కోరడం సరైన చర్య కాదన్నారు. సెక్యూరిటీ లేని ఉద్యోగాలకు సెక్యూరిటీ బాండ్లు ఏ విధంగా ఇస్తామని ప్రభుత్వ ఉద్యోగులు నిరాకరిస్తున్నారని పేర్కొన్నారు. ఈవిషయాన్ని ఎక్సైజ్ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిస్సహాయత వ్యక్తం చేశారన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డిఎం చెప్పారన్నారు.

అంబరాన్ని తాకిన దేవాంగుల సంబరాలు

విశాలాంధ్ర-పొందూరు : చేనేత వృత్తిదారులైన దేవాంగుల కులాస్తులు ప్రతి ఏడాదికోసారి అంగరంగ వైభవంగా వారాలు జరుపుకుంటున్నారు. వీరి ఆరాధ్యా దవంగా మొక్కుకొని మొక్కులు తీర్చినతరువాతే చేనేత కార్మికుల ఇళ్లల్లో పిల్లలు కు పెళ్లిళ్ల చేయడం ఆనవాయితీ, ఏ శుభాకార్యాలు తలపెట్టినా ముందు స్వామి మొక్కులు ఆనవాయతి, తరతరాలుగా భక్తి శ్రద్ధాలుతో ఉపవాస్యలుతో ప్రభను తయారుచేసి పురావిదులులో భక్తులకు దర్శనం కల్పిస్తారు. అస్సరాభ, అస్సరాభ, అల్లల్లా వీర అంటూ శివుని కుమారుడైన విరభద్రుడునికి మొక్కులు తీర్చుకుంటున్నారు.విరభద్రునికి ప్రీతి కరమైన సోమవారం మేళతాలాలు, మంగళ వాద్యాలు నడుమ అంగరంగ వైభవం మొక్కులు తీర్చుకున్నారు.

నేడు శ్రీసూర్య నారాయణ స్వామివారి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-అరసవల్లి: అరసవల్లి శ్రీ సూర్య నారాయణ స్వామి వారి దేవస్థానం హుండీలను ఫిబ్రవరి 27, మంగళవారం ఉదయం 8 గంటలకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ సిబ్బంది, అనువంశిక ధర్మకర్త, పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు మరియు గ్రామ పెద్దల సమక్షంలో హుండీలను తెరవనున్నట్లు ఈ మేరకు సోమవారం ఉప కమీషనర్ డి.ఎల్.వి రమేష్ బాబు ఒక ప్రకటన జారీ చేశారు.

'ప్రధాని నరేంద్ర మోడీతోనే అభివృద్ధి సాధ్యం'

విశాలాంధ్ర-జలుమూరు/సారవకోట: మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ తోనే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతున్నాయని నరసన్నపేట నియోజకవర్గ కన్వీనర్ గొద్దు భాగ్యలక్ష్మి తెలిపారు. సోమవారం బీజేపీ ప్రజా పోరుయాత్రలో భాగంగా సారవకోట మండలంలో పర్యటించారు. నరేంద్ర మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎన్నో మన రాష్ట్రంలో కొనసాగుతున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం : జిల్లా ఎస్పీ ఎం.దీపిక

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకుస్పందన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఐపిఎస్ సోమవారం నిర్వహించారు.ప్రజల నుండి జిల్లా ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ 41 ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికిచర్యలు చేపట్టారు. స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి 7 దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల నివేదికలను జిల్లా పోలీసుకార్యాలయానికి పంపాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎం. దీపిక ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ట్రాఫిక్ డిఎస్పీ డి.విశ్వనాథ్, ఎస్బీ సిఐలు కె.కె.వి. విజయనాథ్, ఇ.నర్సింహమూర్తి, డీసీఆర్బి ఎస్ఐ గణేష్, డిటిఆర్బీ ఎస్ఐ ప్రభావతి మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 3వ తేదీన పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

- ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాలి
- జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జీలాని సమూన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జీలాని సమూన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 03న, అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయుటకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే 4,5 తేదీలలో కూడా వేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి సందేశం చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. 1,79,984 మంది 5 సంవత్సరాలలోపు పిల్లలకు 1232 పోలియో బూత్ లు, 50 ట్రాన్సిట్ బూతులు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. 78 మొబైల్ టీములు, 121 సూపర్వైజర్ బృందాలుగా ఏర్పడి 3,12,000 డోసులు వేయడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయినట్లు తెలిపారు. మొబైల్ టీములు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అన్ని సంచార జాతుల వారి పిల్లలకు, ఇటుక బట్టీలు నిర్వహించు వారి పిల్లలకు, నిర్మాణ స్థలాలు మరియు ఫిషరీస్ ప్రదేశాలలో

శతశాతం లక్ష్యంగా విజయవంతం చేయడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ బి మీనాక్షి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఈశ్వరి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డా విద్యా సాగర్, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, రవాణా, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అధికారులకు వినతిపత్రం

విశాలాంధ్ర-టెక్కలి: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా 554 రైల్వేస్టేషన్లో పునరాభివృద్ధికి కార్యక్రమంలో భాగంగా సోమవారం నౌపడ ఆర్ఎస్ లో జరిగినటువంటి కార్యక్రమానికి హాజరైన రైల్వే అధికారికి స్థానికులు వినతి పత్రం ఇవ్వడం జరిగినది నౌపడ రైల్వే స్టేషన్లో కోణార్క్ పలక్ నమా, యశ్వంత్పూర్, పారాదీప్, హిరాఖండ్ తదితర ట్రైన్స్ నిలుపుదల చేయాలని, జిల్లా ఉన్నత పాఠశాల లో చదువు తున్నా విద్యార్థులు రైల్వే ట్రాక్ దాటుకుంటూ వెళుతున్నారు కావున ఫుట్ పాత్ బ్రిడ్జి ఎర్పాటు చేయాలని కోరారు.రైల్వే అధికారులను కలసిన వారిలో.సమతా సైనిక్ దళ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు చల్లా రామారావు, పాతనౌపడ సర్పంచ్ దల్లి సంధ్య రాణి,ఎంపీటీసీ సుగ్గు అప్పలరెడ్డి, దళ్ళి లోకేష్ మరియు దల్లి

కొండబాబు, బుడ్డెపు రామారావు, జీరు యోగిస్వరావు, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధి హర్షణీయం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : స్థానిక రైలు నిలయంలో సమస్యలను పరిష్కరించడానికి దశాబ్దాలుగా ఇక్కడి ప్రజలు విజ్ఞప్తులు చేయడం అందుకు అనుగుణంగా పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలిసి తాను కూడా రైల్వే ఉన్నతాధికారులకు విన్నవించడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా స్థానిక రైలు నిలయం పునరాభివృద్ధికి వర్చువల్ విధానంతో ప్రధాని నరేంద్రమోడీ నిర్వహించిన శంఖుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరైయ్యారు. ఛీఫ్ ఇంజనీర్ చంద్రమోహన్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అమృత్ భారత్ పథకం ద్వారా రైలు నిలయంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఫ్లాట్ ఫారంల పొడిగింపువంటి కార్యక్రమాలు చాలా ఉపయోగకర మైనవే అని, ఇక్కడి ప్రజలు దశాబ్దాలుగా కోరుతున్న పూరీ-అహ్మదాబాద్, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ల నిలుపుదలతో పాటు, రైల్వే ప్రాంగణంలో ఆటో స్టాండ్‌కు ఆటో కార్మికుల విజ్ఞప్తిని పరిశీలించాలని ఎమ్మెల్యే ఛీఫ్ ఇంజనీర్‌ను కోరారు. భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుద్దాల నిర్మల మాట్లాడుతు నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశమంతటా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నా యని, ప్రపంచ స్థాయిలో దేశ ఉన్నతి కాపాడబడు తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ

రష్మీరంజన్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కుమార్, జెడార్సీసీ మెంబర్ కట్టా సూర్యప్రకాష్, జ్ఞానభారతి సి.ఈ.ఓ జోహర్‌ఖాన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాలిన డిల్లీ, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కాళ్ళ ధర్మారావు, నందిక జానకిరావు, కౌన్సిలర్లు ఆశి లీలారాణి, కాళ్ళ దిలీప్, గేదెల శేఖర్, నారాయణ బెహరా, న్యాయవాది నాగరాజ్ పాత్రో, ఎమ్డీ జిలానీ, తదితరులు పాల్గొన్నారు.

పెదబొండపల్లి ఎంపీపీ రెగ్యులర్ పాఠశాలను ఎంఈఓ-1 తనిఖీ

విశాలాంధ్ర-పార్వతీపురం : మండలంలోని పెదబొండపల్లి (రెగ్యులర్) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి-1 సామల సింహాచలం సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఎన్నికలకు సంబంధించిన మంచి నీరు, విద్యుత్, ఫాన్స్, టాయిలెట్స్ సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం టీచర్ల డైరీలను, లెసన్ ప్లాన్స్ ను తనిఖీ చేశారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఉపాధ్యాయులు డైరీలు, లెస్సన్ ప్లాన్స్ పూర్తి చేసి ఉండటంతో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వర్క్ బుక్ కరెక్షన్స్ పరిశీలించి పూర్తి స్థాయిలో పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఒకటి, రెండు తరగతుల విద్యార్థులతో తెలుగు, ఆంగ్ల పదాలను చదివించారు.ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనాభ్యసన సామగ్రి పరిశీలించి, తరగతి గదిలో ప్రదర్శించడం పట్ల హెచ్ఎం సుజాతను అభినందించారు. వెనుకబడిన విద్యార్థుల కొరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఎంటీ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

80 లీటర్ల నాటు సారా స్వాధీనం

సబ్ ఇన్స్పెక్టర్ జగదీష్‌నాయుడు

విశాలాంధ్ర-సీతంపేట : పోలీస్ హౌస్ అధికారి జగదీష్ నాయుడు తన సిబ్బంది తో కుడ్డపల్లి పంచాయతీ గ్రామ సందర్శనకు వెళు ుండగా కోవరడంగ్ గ్రామ పొలిమేర వద్ద ఉన్న 80 లీటర్ల నాటు సారాను సీజ్ చేసి, 1600 లీటర్ల ఫెర్మెంటరీ జాగిరీ ని ధ్వంసం చేసినట్లు ఎస్సై తెలిపారు, కేసు నమోదు చేసి, ముద్దాయి కోసం వెతుకుతున్నట్లు సీతంపేట పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్. జగదీష్ నాయుడు తెలిపారు.